క్లుప్తంగా

'బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

దహెగాం: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పను మరోసారి గెలిపించుకోవాలని జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు అన్నారు. బుధవారం మండలంలోని గిరవెల్లి గ్రామంలోని రామాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల రైతుబంధు సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర

పెంచికల్‌పేట్: మండలంలోని పంచకళపురి క్షేత్రంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంతో పాటు ఆయా గ్రామాల్లోని మండపాల్లో కొలువుదీరిన దుర్గాదేవీల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం పెద్ద వాగులో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కొండాపూర్, బుద్ధిపల్లి, గొల్లపల్లి, పెద్దంపేట గ్రామాల్లో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు బుధవారం ఇంటింటా పర్యటించి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాల వివరిస్తూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి విజయాన్ని అందించి అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇతర రాష్ట్రాలకు తెలంగాణ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లోనూ అమలు చేయబోయే పథకాలతో బీఆర్ఎస్ ప్రజలకు మరింత చేరువ కానుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ సత్తయ్య, నాయకులు రవి, స్థానికులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

లక్సెట్టిపేట: మండలంలోని రంగపేట, హన్మంతుపల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరా రు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే దివాకర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

తెమడ పరీక్ష చేయించుకోవాలి

నార్నూర్: అనుమానితులు తప్పని సరిగా తెమడ పరీక్షలు చేయించుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో తెమడ పరీక్ష శిబిరం నిర్వహించారు. మొత్తం 19 మందికి తెమడ పరీక్ష చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం మించిన దగ్గు, బరువు తగ్గడం , ఆకలి మందగించడం, ప్రతిరోజు రాత్రి జ్వరం రావడం, చమటలు రావడం లక్షణాలు ఉంటే ఆశ కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌టీ రవీందర్, ఆశ కార్యకర్తలు గుంపాబాయి, మారుబాయి, అనిత, లక్ష్మి, ఆరుణ, చోలే సంగీత, రాథోడ్ శ్రీలత పాల్గొన్నారు.

'కేసీఆర్ అవినీతి పాలనపై పోరాటం'

పాతమంచిర్యాల: కేసీఆర్ చేస్తున్న అవినీతి పాలన అంతమొందించడానికి తెలంగాణ ఉద్యమ శక్తులు ఒక్కటై ఉద్యమించాలని తెలంగాణ జనసమితి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రజల ఐక్యతకు మైలురాయిగా నిలిచిన మిలియన్ మార్చ్ స్ఫూర్తితో, కేసీఆర్ అవినీతి పాలనపై పోరాటం చేసి తెలంగాణను కాపాడుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను వంచిస్తున్నారని, అమరుల త్యాగాల ను, ఉద్యమ ఆకాంక్షలను మర్చిపోయి అక్రమ సంపాదన ఆధిపత్య రాజకీయాల కోసం తెలంగాణ ప్రాంత ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, యువకుల ఆత్మహత్యలకు కారకుడయ్యారన్నారు. ఎన్నికల ప్రయోజనాల కోసం తెలంగాణ ఆర్థి క వ్యవస్థను కుప్పకూల్చి, అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని విమర్శించారు.

'మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకెళ్దాం'

జన్నారం: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రూపొందించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, నియోజకవర్గ అభ్యర్థి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని జన్నారం ఎంపీటీసీ ఎండీ రియాజొద్దీన్ పేర్కొన్నారు. జన్నారం గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం బుధవారం హరిత రీసర్ట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్‌నాయక్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం ఇప్పుడు పని చేస్తే, పార్టీ మనకు తగిన గుర్తింపు తెస్తుందన్నారు.

పాఠశాలలో పారిశుధ్య లోపం!

- నత్తనడకన సాగుతున్న సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు
- పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించని వైనం
- నేడు బడులు పునఃప్రారంభం



పాఠశాల ఆవరణలో లోపించిన పారిశుధ్యం

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీఎస్ఎస్)లో పారిశుధ్యం లోపిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఎదుట నిర్మించాల్సిన డ్రెయినేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దసరా సెలవుల్లో పనులు పూర్తి చేసి విద్యార్థులు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నేడు బడులు పునఃప్రారంభమవుతున్నా పనులు ఇంకా పూర్తి కాలేదు. మరోవైపు సైడ్ డ్రెయిన్‌పై సిమెంట్ స్లాబ్ నిర్మించినా, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో విద్యార్థులు రాకపోకలు సాగిస్తే కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

దసరా సెలవుల్లో పనులు ప్రారంభం..

మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో మొత్తం 720 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా పాఠశాల పని దినాల్లో పాఠశాల ముందు పనులు చేపట్టడం అసాధ్యంగా భావించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా దసరా సెలవుల్లో సైడ్ డ్రెయిన్ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. దసరా సెలవులు ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకు 12 రోజులు ఉన్నాయి. సెలవు రోజుల్లో సైడ్ డ్రెయిన్ పనులు పూర్తి చేస్తే పాఠశాల ఆవరణలో మురుగు సమస్యకు చెక్ పడేది. దీంతో పాటు విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు దారి కూడా ఉండేది. కానీ పాఠశాల ముందు సుమారు మూడు ఫీట్ల వెడల్పుతో నిర్మించాల్సిన డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. కానీ కొంతమేర మాత్రమే పనులు పూర్తయ్యాయి. దీంతో పాఠశాల ఆవరణలో పారిశుధ్యం లోపిస్తుంది. నేడు పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా నూతనంగా డ్రెయినేజీపై వేస్తున్న స్లాబు బిల్ల పైనుంచి విద్యార్థులు రాకపోకలు సాగిస్తే అది కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

త్వరగా పనులు పూర్తి చేయాలి

పాఠశాల ఆవరణలో మురుగు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. విద్యార్థులు ప్రమాదాలకు గురి కాకుండా డ్రెయినేజీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి. త్వరగా పనులు పూర్తి చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.
– నటరాజ్, హెచ్ఎం, జెడ్పీఎస్ఎస్, వాంకిడి

నాసిరకం పనులు..



నిర్మాణ దశలోనే పగుళ్లు తేలిన డ్రెయినేజీ

పాఠశాల ముందు నిర్మిస్తున్న సైడ్ డ్రెయినేజీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. పాఠశాల ఎదుట డ్రెయినేజీపై స్లాబు బిల్లా నిర్మించిన కొన్ని గంటలకే పగుళ్లు తేలింది. విద్యార్థులు రాకపోకలు సాగిస్తే నాణ్యత లోపం ఉన్న సిమెంట్ బిల్లా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

'బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలి'



వరి పొలం పరిశీలిస్తున్న అజ్మీరా శ్యాంనాయక్

రెబ్బెన: రైతుల సమస్యలు పరిష్కరించకుండా మాయమాటలతో మభ్యపెడుతున్న బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు అజ్మీరా శ్యాం నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని నక్కలగూడ, ఇందిరానగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి రైతుల స్థితిగతులు తెలుసుకున్నారు. వట్టివాగు ప్రాజెక్టు నీటిపై ఆధారపడి సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. ఆయకట్టు రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని రోజులుగా డీ 9, డీ 10 కాలువల ద్వారా సాగునీరు సరిగా రాకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు అన్ని వేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, మండల నాయకులు పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియాలో బుధవారం బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ గెలుపుతోనే సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ప్రజా సమస్యలపై అధికార పార్టీ నేతలకు పట్టింపు లేదని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఓటు వేసి బీఎస్పీని గెలిపించాలని కోరారు.

'అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా'

బెల్లంపల్లి: ఈ సారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు బెల్లంపల్లికి చెందిన హైకోర్టు న్యాయవాది కాంపల్లి ఉదయ్‌కాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 2018, 2023ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి భంగపడినట్లు తెలిపారు. పార్టీని నమ్ముకుని ఎన్ని సేవలు చేసినా, గుర్తింపు లేకుండా పోయిందని పేర్కొన్నారు. అర్హత లేని నాయకులకు టిక్కెట్లు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని, బాధ్యతగా ప్రజలకు సేవలు చేసే నాయకులు లేరని తెలిపారు. న్యాయవాదిగా, చట్టాలు తెలిసిన వ్యక్తిగా చట్టసభలో ఉండే పూర్తి అర్హత తనకు ఉందని తెలిపారు. ప్రజల్లో తనకు మంచి మనుగడ ఉందని, ప్రజలు తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. బెల్లంపల్లి స్థానికుడిగా ప్రజలతో ఉన్న సత్సంబంధాలతో ప్రజలే తనను గెలిపించుకుని అసెంబ్లీకి పంపిస్తారని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి



తిర్యాణి: ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు



బెజ్జూర్: కవాతు చేస్తున్న పోలీసులు

తిర్యాణి: ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని రెబ్బెన సీఐ అల్లం నరేందర్ అన్నారు. రానున్న శాసన సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలీసులు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్సై చుంచు రమేశ్ తదితరులు ఉన్నారు.

బెజ్జూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని డీఎస్పీ కరుణాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బెజ్జూరు పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటు సీఆర్‌పీఎఫ్, టీఎస్ఎస్పీ పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. జ్యోతిబాపూలే విగ్రహం నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కవాతు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఐ సాధిక్ పాషా, ఎస్సై విక్రమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దారి లేక నిరుపయోగం..!

- ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేని సెగ్రిగేషన్ షెడ్లు
- ఖాళీ స్థలాల్లో చెత్త వేసి నిప్పంటిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న షెడ్డు



దారి సౌకర్యం లేని రెబ్బెన సెగ్రిగేషన్ షెడ్డు

రెబ్బెన: ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజుపెంకులు, ఇతర వస్తువులు వేరు చేసేందుకు ప్రతీ పంచాయతీలో ఒక సెగ్రిగేషన్ షెడ్డు నిర్మించింది. ఇందుకు ఒక్కో సెగ్రిగేషన్ షెడ్డుకు ప్రభుత్వం రూ.2 లక్షలు వెచ్చించింది. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో అధికారులు సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించారు. తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈమేరకు గ్రామాల్లో సేకరించిన తడి చెత్తను ట్రాక్టర్ల ద్వారా సెగ్రిగేషన్ షెడ్లకు తరలిస్తూ కొన్నిచోట్ల సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. అయితే కొన్ని పంచాయతీల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా సెగ్రిగేషన్ షెడ్లకు వెళ్లేందుకు దారి సౌకర్యం లేకుండా పోయింది.

నేటికీ దారి సౌకర్యం కరువు..

పంచాయతీలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి రెవెన్యూ అధికారులు పంచాయతీలకు అప్పగించగా సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. రెబ్బెన గ్రామ పంచాయతీలో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో ఇందిరానగర్ సమీపంలో సెగ్రిగేషన్ షెడ్డు, డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించారు. అదే తరహాలో గంగాపూర్ గ్రామ పంచాయతీలో స్థలం లేని కారణంగా లక్ష్మీపూర్ శివారులో కేటాయించారు. కానీ రెవెన్యూ అధికారులు సెగ్రిగేషన్ షెడ్లకు వెళ్లే దారికి స్థలం చూపకపోవడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. రెబ్బెన, లక్ష్మీపూర్, గంగాపూర్ గ్రామ పంచాయతీల సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా నేటికి దారి సౌకర్యం లేకపోవడంతో తడి, పొడి చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితి ఉంది. దీంతో ఆయా పంచాయతీల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో చెత్తను వేసి నిప్పు పెడుతున్నారు. కాగా నిర్వహణ లేక సెగ్రిగేషన్ షెడ్లలోని సేంద్రియ ఎరువుల తయారీ పిట్లు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి.

చొరవ చూపని రెవెన్యూ అధికారులు..

లక్షలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లకు దారి సౌకర్యాన్ని కల్పించటంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాటికి దారి సౌకర్యం లేక పంచాయతీ సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలానికి ఇరువైపులా ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు అందుబాటులో ఉన్నప్పటికీ దారి ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు చొరవ చూపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం



జైనూర్: చింతకర్రలో దుర్గామాతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

జైనూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో దుర్గామాత, శారదామాతలకు భక్తిశ్రద్ధలతో బుధవారం నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలతో పాటు భజన, భక్తి గీతాలు పాడారు. దసరా పండుగ పురస్కరించుకొని గ్రామంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామ శివారులో గల చెరువులో నిమజ్జనం చేశారు.

కెరమెరిలో..



కెరమెరి: నృత్యం చేస్తున్న మహిళలు

కెరమెరి: మండల కేంద్రంలో బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం నిర్వహించారు. గడిచిన తొమ్మిది రోజులుగా వివిధ రూపాలలో దర్శనమిచ్చిన జగదాంబదేవికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జనోత్సవంలో భాగంగా మహిళలు నృత్యాలు చేశారు. దాండియా ఆడారు. ఆయా మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు.

దండారీ ఉత్సవాలకు ప్రభుత్వం చేయూత



జైనూర్‌లో మాట్లాడుతున్న జుగ్నక దేవురావు

జైనూర్: ఆదివాసీలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే అతిపెద్ద పండుగ దండారీ ఉత్సవాలని మార్లవాయి సార్మేడి జుగ్నక దేవురావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం దండారీ ఉత్సవాలకు రూ.10 వేలు అందిస్తుందన్నారు. జైనూర్, సిర్పూర్(యూ) మండలాల్లోని ఆకాడిపేన్‌లు గల గ్రామ పటేళ్లు, పెసా మొబిలైజర్లు తమ ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను సకాలంలో అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సార్మేడీలు తదితరులు ఉన్నారు.

'కలిసికట్టుగా పని చేస్తేనే విజయం'

నెన్నెల: కాంగ్రెస్ కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేస్తేనే బెల్లంపల్లి నియోజకవర్గంలో విజయం సాధిస్తామని గుండ్లసోమారం ఎంపీటీసీ రమేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొద్ది సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేశామన్నారు. ప్రస్తుత రాజకీయ కోణంలో సీనియర్లకు, పార్టీ ప్రజాప్రతినిధులకు ఎలాంటి ప్రాధాన్యం లేకుండా పోయిందన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి పార్టీ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజల ముందుకు తీసుకెళ్లిన సీనియర్ నాయకులకు ఎలాంటి సమాచారం లేకుండా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, ఇలాంటి దోరణిని మార్చుకోవాలని హెచ్చరించారు. సీనియర్లను గుర్తించి కలిసి పనిచేయకపోతే బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి నష్టం జరుగుతుందన్నారు.

'కాంగ్రెస్ గ్యారంటీ హామీలు అమలు చేస్తాం'



హమాలీవాడలో ప్రచారం చేస్తున్న సురేఖ

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలను తప్పకుండా అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలివాడలో బుధవారం గడపగడపకూ వెళ్లి, కాంగ్రెస్ గ్యారంటీ హామీలను వివరించారు. నవంబర్ 30వ తేదీన జరిగే శాసనసభ ఎన్నికల్లో మంచిర్యాల అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్, రాజేశ్వర్‌రావుపల్లె గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసేలా ప్రవేశపెట్టే ఆరు గ్యారంటీ హామీలను ఇంటింటికీ వెళ్తూ అందరికీ వివరించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు నియోజకవర్గంలో విస్తృతంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి భారీ మెజారిటీతో గెలుపు అందించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెలిమెల చంద్రమౌళి, నల్ల వెంకటేశ్, అంజి, సాంబారి కుటుంబరావు, తిరుపతి, భూమేశ్, సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో 'అలయ్ -బలయ్ '



మాట్లాడుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లో పద్మశాలీ పట్టణ అధ్యక్షుడు కుడికాల రాజమౌళి ఆధ్వర్యంలో దసరా ముగింపు ఉత్సవాల సందర్భంగా అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో మెలుగుతూ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు గుల్లపల్లి ఆనంద్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల కనకయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి హనుమాన్ల కేదారి, జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజన్న, బీజేపీ నాయకుడు సత్యనారాయణ, సంఘ నాయకులు నాగేశ్వరరావు, సదానందం, మమత, జి.లావణ్య, సునీత పాల్గొన్నారు.

లయన్స్ సేవలకు 50 ఏళ్లు

మంచిర్యాలటౌన్: లయన్స్ క్లబ్ సేవలను ప్రారంభించి 50ఏళ్లలోకి అడుగు పెడుతున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ ఇయర్ వేడుకలను జిల్లా కేంద్రంలో బుధవారం కేక్ కట్ చేసి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ద్వారా సేవలను అందించిన పట్టణ ప్రముఖులు జి.నరసింహారెడ్డి, జి.హనుమంతరావు, వి.రత్నారెడ్డి, ముత్యాల శంకరయ్య, మోటూరు నారాయణ, వాసుదేవ్ కేడియా, డాక్టర్ నాగేశ్వర్ రావు, డాక్టర్ పి.నారాయణతో పాటు, పలువురు ప్రముఖులతో కూడిన చిత్ర పటాల ఫ్లెక్సీని విడుదల చేశారు. అనంతరం పేద ప్రజలకు బ్లాంకెట్స్‌ను పంపిణీ చేశారు. ప్రోగ్రాం చైర్మన్లు ఏ.బాలాజి, వి. మధుసూదన్ రెడ్డి, మంచిర్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏ.బాలాజి పాల్గొన్నారు.

భూమిపూజ

జన్నారం: మండలకేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయ ఆలయం వద్ద నూతనంగా నిర్మించే నవగ్రహాల ప్రతిష్ఠకు బుధవారం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చెటుపల్లి గంగయ్య భూమిపూజ చేశారు. భక్తుల సౌకర్యం కోసం కార్యక్రమం చేపట్టినట్లు గంగయ్య తెలిపారు.